# అమ్మా నాన్నా - ఫిఫ్టీ ఫిఫ్టీ

## మువ్వా శ్రీనివాస్

విశాఖ ఎక్స్‌ప్రెస్ వేగంగా ప్రయాణిస్తోంది. అంతకంటే వేగంగా అందులో ప్రయాణం చేస్తున్న పాండురంగారావుగారి ఆలోచనలు పరిగెడుతున్నాయి.

ప్రాణంకంటే ఎక్కువగా ప్రేమించిన కన్నబిడ్డలు ఇచ్చిన తీర్పు తన జీవితంలో ఇన్ని అలజడులు సృష్టిస్తాయని ఆయన కలలో కూడా ఊహించలేదు. హాయిగా మనవళ్ళతో ఆడుకుంటూ సహధర్మచారిణితో కల్సి విశ్రాంతి తీసుకోవాల్సిన ఈ వయసులో తనకెదురైన అనుభవాల్ని తలచుకుంటేనే రైలుపట్టాలు మీద నలిగిన రూపాయి నాణెంలా అయిపోతోంది మనసు.

ఒక్కసారిగా కళ్ళముందు భార్య కస్తూరమ్మ ఆకారం కదలాడింది. అంతే! వెంటనే ఆయన కళ్ళల్లో నీళ్ళు సుడులు తిరిగాయి. అప్పటికి ఇట్టే సంవత్సరకాలం గడిచిపోయింది ఆమెను చూసి.

''ఇక ఈ చరమాంకంలో కళ్ళు మూసేలోపు కనీసం ఒక్కసారన్నా తన అర్ధాంగిని, జీవితంలో సగభాగాన్ని చూడగలిగే అవకాశం వస్తుందో లేదో?'' అన్న సందిగ్ధమే ఈమధ్య ఓ పెద్ద పెనుభూతమై పీడిస్తోంది పాండురంగారావుగార్ని.

ఆయన ఉద్యోగ బాధ్యతల్ల నుండి పదవీ విరమణ చేసి అప్పటికే ఐదు సంవత్సరాలు కావస్తోంది. ఉద్యోగంలో వున్నంతకాలం ఏనాడూ ఒకరితో మాట పడకుండా నిజాయితీ మేళవించిన వాడిగా పేరు తెచ్చుకున్నాడు. అడిగినవారికి కాదనకుండా సహాయం చేసాడు. ఇంకా సర్వీస్ ఉండగానే వాలంటరీ రిటైర్‌మెంట్ తీసుకుని ఆ ఉద్యోగం పెద్ద కొడుకు బాలాజీకి వేయించాడు. రిటైర్ అవగా వచ్చిన డబ్బుతో చిన్న కొడుకు రవీంద్రకి వైజాగ్‌లో వ్యాపారం పెట్టించాడు. నిజానికి హైదరాబాద్‌లోనే పెట్టించాలనుకున్నాడు. కానీ రవీంద్ర తన మామగారికి దగ్గరగా వుండి అక్కడే సెటిలవుతానని పట్టుబట్టేసరికి కాదనలేకపోయాడు.

ఇద్దరు కొడుకుల పెళ్ళిళ్ళు చేసేసాను. ఇద్దరికీ ఉపాధి కూడా కల్పించేసాను. ఇక ఇప్పుడు జీవితం లోంచి కూడా హాయిగా రిటైర్‌మెంట్ తీసేసుకోవచ్చు'' అని అనుకుంటున్న సమయంలో సరిగ్గా అప్పుడే మొదలయ్యాయి ముసలి దంపతుల కష్టాల పర్వంతం.

''ఇద్దరూ ఒకరి దగ్గరే వుంటే ఇద్దరి భారం మోయడమే! అమ్మో! నావల్లకాదు'' అంటే నావల్ల కాదు అనుకున్నారు. అందుకే అన్నదమ్ములిద్దరూ ఆసాంతం ఆలోచించి అమ్మానాన్నల్ని పంచుకున్నారు.

అమ్మ కన్నా నాన్న రెండు ముద్దలు ఎక్కువ తింటాడు. నాన్న కాకుండా అమ్మయితే ఇంటి చాకిరీ కూడా చేస్తుంది అన్న మీమాంసకు బదులుగా సమానత్వం సమాధానమై నిల్చింది. అందుకే ఒకరు ఒకర్ని మూడునెలలపాటు వుంచుకునేలా ఏర్పాటు చేసుకున్నారు.

తను పెద్దకొడుకు దగ్గరుండి అప్పటికి తొంభై రోజులు గడిచిపోయాయి. ఇక ఈనెల నుంచి చిన్న కొడుకు వాటా కావడంతో అక్కడికే బయలుదేరాడు. అదేరోజు కస్తూరమ్మ కూడా చిన్నకొడుకు దగ్గర్నుంచి పెద్దకొడుకు దగ్గరకు బయలుదేరి వుంటుంది. ఆయనకు తెలుసు వైజాగ్ నుండి బయలుదేరిన రైలు ప్రస్తుతం తను ప్రయాణిస్తున్న రైలుని క్రాస్ చేస్తుందని.

ప్రతీ మూడు నెలలకోసారి అలా క్రాస్ అయ్యే రైలుని ఎంతో ఆత్రంగా గమనిస్తాడాయన తన భార్య కస్తూరమ్మ కనిపిస్తుందేమోనని! కానీ ఏనాడూ ఆయన కోరిక తీరలేదు. క్రాస్ అయ్యి కదిలిపోతున్న రైలుకు కన్నీళ్లతోనే వీడ్కోలు చెబుతాడు.

రైల్లో ఒక్కసారిగా కుదుపు రావడంతో ఉలిక్కిపడి ఈలోకంలోకి వచ్చాడు పాండురంగారావు. ''వైజాగ్ నుండి వస్తున్న ఎక్స్‌ప్రెస్ క్రాసింగ్ వుంది'' అంటున్నారెవరో.

ఒక్కసారిగా పాండురంగారావు గుండె వేగం పెరిగింది. ఆతృత, ఆశగా లేచి తలుపు దగ్గరకు వెళ్లాడు. కదిలిపోతున్న రైలుని కన్నీళ్లతో మసకబారిన కళ్ళుబాటునుండి చూసాడు. నిరాశగా ఆ రైలుని చూస్తూ ''పిచ్చిది లోపలెక్కడో వుండుంటుంది. ప్రయాణంలో అదేపనిగా నిద్రపోవడం అలవాటు దానికి'' అనుకుంటూ వీడ్కోలు చెప్తున్నట్లుగా కనిపించని కస్తూరమ్మకు చిన్నపిల్లాడిలా చెయ్యి వూపుతూ ఆ రైలు వెళ్ళేదాకా అలాగే ఉండిపోయాడు.

అప్పుడప్పుడు అతనికి అనిపిస్తూ వుంటుంది పిల్లలమీద మరీ అంత ఎక్కువగా మమకారాన్ని పెంచుకోవడం కూడా తప్పేమోనని. లేకుంటే ముందు చూపు లేకుండా ముందు జాగ్రత్త లేకుండా కూడా వచ్చిన నయాపైసల్తోసహా మొత్తం కొడుకు చేతిలో ధారపోసి ఇలా నిరాశ్రయులై వారిమీద ఆధారపడి ఛీత్కారపు బ్రతుకు బ్రతకడం బహుశా ప్రతి తల్లిదండ్రుల స్వయంకృతాపరాధమేమో!

భారంగా ఓ నిట్టూర్పు విడిచి వెళ్లి తన సీట్లో కూర్చున్నాడు పాండురంగారావు. ఎంత వద్దనుకున్నా భార్య జ్ఞాపకాలు, ఆమె సహనం, సాహచర్యం, ఆమె ఆప్యాయత, అనురాగం గుర్తొస్తుంటే లోలోపల ఓ తీపి వేదన. బ్రతికున్న భార్యను చావుతో కాలం వేరు చేసిన వ్యక్తిని గుర్తు చేసుకున్నట్లుగా తలచుకోవడం నిజంగా దౌర్భాగ్యమే.

వైజాగ్‌లో రైలు దిగిన పాండురంగారావు చిన్నకొడుకు రవీంద్ర ఇంటికి బయలుదేరాడు. ఇంటికి చేరేసరికి చిన్నకోడలు ఎదురొచ్చి ఆయన్ని లోనికి తీసుకెళ్లింది. మెల్లగా అంది ''మామయ్యా! అత్తయ్యకి నిన్నటినుండి జ్వరంగా వుంది. మిమ్మల్ని చూడాలని తెగ కలవరిస్తోంది.''

ఆ మాటలకు పాండురంగారావు గుండె కలుక్కుమంది.

''ఏంటీ మీ అత్తయ్యకి జ్వరమా? ఇప్పుడెలా వుందమ్మా?'' అంటూ ఆందోళనగా లోపలకు ప్రవేశించాడు.

అప్పటికే ఏ పది పదిహేనుసార్లో కోడల్ని ''ఇంకా మీ మామయ్యాగారు రాలేదేంటమ్మా? ప్రతిసారీ ఏ వేళకు వస్తారు?'' అంటూ అడిగి అడిగి అలసిపోయి అప్పుడే చిన్నగా నిద్రలోకి జారుకుందామె.

పాండురంగారావు ఆమె దగ్గరకు వెళ్లాడు. భార్య ముఖంలో అలసట స్పష్టంగా కనిపిస్తోంది.

''ఇదిగో నిన్నే...'' ఆమె నుదుటి మీద చెయ్యి వుంచాడు. దాంతో ఉలిక్కిపడ్డట్లుగా కళ్లు తెరిచింది కస్తూరమ్మ. ఒక్కసారిగా ఆమెకు ఎవరో అర్థం కాలేదు. అర్థమయిన వెంటనే ఆమె కళ్ళు విప్పారాయి. సంతోషంతో ఆమె పెదాలు వణికాయి.

''ఏవండీ వచ్చారా? ఈ జన్మకి మిమ్మల్ని చూసే భాగ్యం లేదనుకున్నాను. నేను చాలా అదృష్టవంతు

రాల్ని. ఎలా వున్నారండీ?'' ఆప్యాయంగా పాండు రంగారావు చేయి నొక్కింది.

''నువ్వెలాగున్నావ్? ఒంట్లో ఎలావుంది? జ్వరమ టకదా?'' ఆయన కంఠం జీరబోయింది.

''నాకేం నిక్షేపంలా వున్నాను. మిమ్మల్ని చూసా నుగా. అది చాలు'' అంది.

ఆయన కళ్ళు ఎందుకోమరి తెలీకుండానే వర్షించ సాగాయి. ఆయన కన్నీళ్ళు తుడిచింది కస్తూరమ్మ.

లేని శక్తిని కూడబలుక్కుని తెచ్చుకుంది. ఆయన వెంట తెచ్చుకున్న పెట్టె తెరిచి అందులోంచి కండువా, లుంగీ ఇచ్చి అలాగే వెళ్లి బాత్రూమ్‌లో బకెట్‌లోకి నీళ్ళు తోడింది.

ఆయన స్నానం చేసి రాగానే పెట్టెలో వున్న రెండు జతల బట్టలు తీసి ఆయన వద్దని వారిస్తున్నా శుభ్రంగా ఉతికింది. కస్తూరమ్మ చేస్తున్న హడావుడికి ఉక్కిరిబిక్కిరైపోయాడు పాండురంగారావు.

అమ్మ చేస్తున్న హడావుడి చూసి మండిపడిపో యాడు రవీంద్ర.

''జ్వరం వచ్చిన దానివి. విశ్రాంతి తీసుకోక ఈ చాదస్తం ఏమిటి? తర్వాతేం జరిగినా మా చావుకొ స్తుంది'' అంటూ కేకలు వేసాడు.

మౌనంగా రోదించడం మినహా ఏమీ మాట్లాడ లేకపోయారు ముసలి వాళ్లిద్దరూ.

ఆ రోజు మధ్యాహ్నం కొసరికొసరి అన్నం వడ్డించింది కస్తూరమ్మ పాండురంగారావుకి.

''నువ్వు కాస్త ఎంగిలిపడరాదూ?'' అడిగారా యన.

''నోరంతా మరీ చేదుగా వుంది. అదీగాక జ్వరం పూర్తిగా తగ్గకుండానే పథ్యం మానేస్తే ఎలా?'' చెప్పిందావిడ.

కోడలు కూడా అత్తయ్యగార్ని అడిగింది ''కనీసం మజ్జిగన్నమైనా తినండి. ఏమీ తినకుండా అలా పస్తుంటే ఎలా?''

ససేమిరా సహించడంలేదంటూ తప్పించుకుంది కానీ ఒక్క మెతుకు కూడా ముట్టలేదు.

అందుక్కారణం లేకపోలేదు. నిజానికి నిన్న సాయంత్రం ట్రైన్‌కు తను పెద్దకొడుకు దగ్గరకు బయలుదేరాల్సి వుంది. కానీ కస్తూరమ్మ బయలుదే రకుండా అలాగే వుండిపోయింది.

దాంతో చిన్నకొడుకు రవీంద్ర వచ్చి తల్లిని ప్రయా ణానికి సిద్ధం కమ్మన్నాడు. కానీ కస్తూరమ్మ తనకు ఒంట్లో నలతగా వుందని ఓ రెండురోజులాగి వెళ్తా నని చెప్పింది.

దాంతో రవీంద్ర ఎక్కడలేని కోపంతో ఏమాత్రం మానవత్వం లేకుండా ''రేపు నాన్న వచ్చేస్తాడు. ఇద్దరూ ఇక్కడేవుంటే ఎలా కుదురుతుంది? ఇద్దరికీ భోజనాలు పెట్టడమంటే మాటలుకాదు. అయినా ముందుగా అన్నయ్య నేను కుదుర్చుకున్న ఒప్పందం మరచిపోయావా? రెండు మూడు రోజు లుంటానంటావ్. ఆ తర్వాత పదంటావ్. ఇక తర్వాత శాశ్వతంగా ఇక్కడే తిష్ట వేస్తానంటావ్. ఇద్దర్నీ భరించడమంటే నావల్లకాదు కాక కాదు'' అంటూ కస్సుబుస్సుమన్నాడు.

దాంతో ఉబికి వస్తున్న కన్నీటిని బలవంతాన ఆపు కుంటూ ఆ తల్లి అంది ''చిన్నప్పుడు అన్నం తిననని మారాం చేసేవాడివి. కానీ ఇప్పుడు నాకు అన్నం పెట్టడానికి మారం చేస్తున్నావ్. చూడు నాయనా రవీ! చిన్నప్పుడు నువ్వు అన్నం తినడానికి మారం చేస్తే అలా నీ కడుపు నువ్వు కాల్చుకో అని ఊరుకోలేదురా నేను. చందమామ రావే జాబిల్లిరావే అంటూ పాటలు పాడుతూ ఇది అమ్మ ముద్ద, ఇది నాన్న ముద్ద అంటూ గోరుముద్దలు తినిపిస్తూ, అనగనగా ఏడుగురు రాజులు, ఏడుగురు వేటకెళ్లారు అంటూ కథలు చెప్తూ నిన్ను బుజ్జగించి నిన్ను బ్రతిమాలి నిన్ను గారంచేసి అన్నం తినిపించేదాన్ని. ఎంతైనా అమ్మ మనసుకదురా. నువ్వు కడుపునిండా అన్నం తింటే నేను భుక్తాయాసంతో కడుపు



## థీమ్

రింగుమంటూ మోగిన టెలిఫోన్ రిసీవర్‌ఎత్తి ''హలో'' అన్న సుబ్బారావుకి కాస్సేపు విన్నాక అవతలి నుండి మాట్లాడే వ్యక్తి తన ప్రియురాలితో నిన్న సినిమాకు రాలేకపోయినందుకు సంజాయిషీగా కథ చెబుతున్నాడని అర్థమయింది.

అంతా విన్నాక ''సారీ...రాంగ్ నెంబర్'' అన్నాడు సుబ్బారావు.

''ఆ విషయం ముందే చెప్పొచ్చుకదా. నాకు ఫోన్ బిల్లు దండుగ'' రుసరుసలాడుతూ విసుక్కున్నాడు ఆ ప్రియుడు.

''నేనో కథల పోటీకి థీమ్ కోసం వెదుకుతున్నాను. మీరు చెప్పిన కథ సరిగ్గా నాకు సరిపోయింది. థాంక్స్'' అంటూ ఫోన్ పెట్టేసాడు సుబ్బారావు.

## ఫాస్ట్‌ఫుడ్

''మీ హోటల్‌లో నిన్న మిగిలిపోయినవన్నీ ఈవేళ వడ్డిస్తారటకదా!'' సర్వర్‌ని నిలదీస్తున్నట్లు అడిగాడు సుబ్బారావు.

''ఛ..ఛ...మీకు ఎవరో రాంగ్ ఇన్‌ఫర్మేషన్ ఇచ్చినట్టున్నారు సార్. మా హోటల్లో ఎంత తాజాగా వుంటాయంటే రేపు వడ్డించాల్సినవి ఈ రోజే వడ్డిస్తారు'' కళ్ళు తిప్పుతూ చెప్పాడు మరీ స్వామి భక్తిపరుడైన ఆ సర్వర్.

## ఉచితం

''నిన్నటివరకూ మీ షాపునిండా గుట్టలు గుట్టలుగా ఉన్న చీరలన్నీ రెండు రోజుల్లోనే ఎలా అమ్ముడయ్యాయి?''

''ఆ...ఏం లేదు. ఒక చీర కొంటే రెండు బిందెల నీళ్లు ఉచితం అని ప్రకటించాం. అంతే!'' అసలు విషయం చెప్పాడు యజమాని.

**-జి.వి.ఎస్.నాగేశ్వరరావు** (చోడవరం)

నిండినదానిలా భావించేదాన్ని. కానీ ఈ రోజు అటువంటి ఈ అమ్మకు రెండు ముద్దులుపెట్టడానికి తెగ బాధపడిపోతున్నావ్. ఎంతైనా కన్నకొడుకువి కదా. సరేలే నాయనా! మీ నాన్నగారు రాగానే వెళ్లిపోతాను. అయినా జ్వరం వచ్చినదాన్ని నాకు అన్నమెలా సహిస్తుంది. సహించదు నాకు సహించదు. ఆ పెట్టే అన్నమేదో మీ నాన్నగారికే పెట్టు కడుపునిండా. అదే నాకు పదివేలు.''

ఆమె మాటలకు శాంతపడ్డాడు రవీంద్ర. కానీ జ్వరం తగ్గాక ఒక్కక్షణం కూడా ఇక్కడ ఉండడానికి వీల్లేదని ఖరాఖండీగా చెప్పాడు. ఆ మాత్రానికే ఎంతో ఉప్పొంగిపోయింది ఆ పిచ్చి తల్లి.

''ఏంటోయ్! అంత ఆలోచనలో మునిగిపోయావ్?'' అడిగాడు పాండురంగారావు.

''ఏమీ లేదండీ?'' జవాబిచ్చింది.


''నువ్వు కాసేపు విశ్రాంతి తీసుకోరాదుటోయ్'' అన్నాడు కొంచెంసేపు ఆ మాటా ఈ మాటా మాట్లాడాక. అలా ఆయన ప్రయాణం బడలికతో ఇట్టే నిద్రలోకి జారిపోయాడు.

కోడలొచ్చి ''కనీసం ఈ అరటిపళ్లన్నా తీసుకోండత్తయ్యా'' అని అడిగినా ఆకలి బాగానే వేస్తున్నా కొడుకు కన్న మాటలు గుర్తొచ్చి వాటిని తీసుకోలేదు. అలా రాత్రి కూడా మంచినీళ్ళు తాగి సరిపుచ్చుకుంది. అలాగే నీర్సంగానే చాపమీద నడుం వాల్చిన ఆమె ఎప్పుడు నిద్రలోకి జారుకుందో తెలీదు.

తెల్లారింది. మనసులకు ముసుగులు, ముఖాలకు మాస్కులు ధరించి యాంత్రిక జీవనాన్ని పరిగెత్తించడానికై లోకం నిద్ర లేస్తోంది. ఆ ఇంట్లో కూడా ఒక్కక్కళ్ళే అంత అప్పుడే నిద్ర లేచి దినచర్యలు మొదలు పెడుతున్నారు.

పాండురంగారావు నిద్ర లేచి కళ్ళు తెరిచేసరికి ఎదురుగా కింద నేలమీద చాప పరుచుకుని నిద్రపోతున్న కస్తూరమ్మ కనిపించింది.

ఆయనకు తన పాతరోజులు గుర్తొచ్చాయి. పెళ్లయిన తర్వాత రోజు నుంచీ మొన్న మొన్న వాళ్ళని కొడుకులు వేరు చేసేవరకూ తను ప్రతిరోజూ నిద్ర లేచి మొదటగా భార్య ముఖం చూసే అలవాటు. అదీగాక అలా నిద్ర లేవగానే ఆమెను చూస్తే ఇక ఆ రోజంతా ఆయనకు ఎంతో ఉత్సాహంగా వుండడమే కాకుండా అనుకున్న పనులన్నీ నెరవేరతాయన్న నమ్మకం కూడా.




మళ్లీ ఇన్నాళ్ళకి ఇలా నిద్రలేచి ఆమెను చూసాడు.

దగ్గరకెళ్లి చిన్నగా భుజం తట్టాడు. ''ఇదిగో నిన్నే! ఒంట్లో ఎలా వుంది?'' అంటూ ఆమె చేతిని పట్టుకుని నాడి చూసాడు జ్వరం తగ్గిందో లేదోనంటూ.

ఆమె వెంటనే పైకి లేచి కూర్చుని అరచేతులు చూసుకుని భర్త కాళ్ళకు దండం పెట్టుకుంటూ అంది ''అయ్యో! పాడు నిద్ర. బాగా పొద్దెక్కినట్టుంది.'' అలా అంటూనే హడావుడిగా లోపలకెళ్లి కోడలి అనుమతి తీసుకుని స్టవ్‌మీద వేణ్ణీల్లు పెట్టి భర్త వద్దంటున్నా వినకుండా ఆయనకు తలస్నానం చేయించింది. తనూ తలస్నానం చేసింది. భర్తకు సాంబ్రాణి పొగ పట్టింది. దేవుడి గదిలోకి తీసుకెళ్లింది. అక్షింతలు ఆయన చేతికిచ్చి ఆయన పాదాలకు ప్రణమిల్లి దీవించమంది.

ఆమెను దీవించి పైకి లేపి తన హృదయానికి హత్తుకుంటూ అడిగాడు ''ఏంటోయ్! ఈ రోజు నీ కళ్లల్లో ఏదో మెరుపు కనిపిస్తోంది.''

అంతే! ఆయన మాటలకు మెరుపు మాయమై ఆమె కళ్ళు జలార్ద్రమైనాయి.

''ఏవండీ! ఈ రోజు ఎంతో విశేషమైన రోజు. మన జీవితాలు ముడివడి వసంతోత్సవం జరుపుకునే రోజు. ఈ రోజుతో మీకు అర్వై సంవత్సరాలు నిండాయి'' ఆమె చెప్పడం పూర్తికాలేదు.

''అంటే...అంటే...''

''అవునండీ. ఇరవైలో పెళ్లి కన్నా అర్వైలో పెళ్లి భలే వుంటుందే. మన పిల్లలు ఆ వేడుక చాలా ఘనంగా చేస్తారు చూడవే అంటూ మీరు ఎప్పుడూ అంటుండే వాళ్ళు గుర్తుందా?''

''అంటే...ఈరోజు మన షష్టిపూర్తి'' అనుకోకుండా ఆయన కళ్ళల్లో కన్నీళ్ళు జీవధార కట్టాయి.

ఇదంతా గమనిస్తోన్న చిన్నకోడలు కళ్ళల్లోంచి కూడా నీళ్ళు తిరగకుండా వుండలేకపోయాయి. తను నిన్నట్నుంచీ అత్తగార్ని గమనిస్తూనే వుంది. అత్తగారి మొహంలో దోబూచులాడుతోన్న సరికొత్త కాంతుల్ని చూస్తూనే వుంది. షష్టిపూర్తినాడు తన భర్త సన్నిధిలో గడపాలనే అత్తగారు లేని జ్వరాన్ని తెచ్చుకుని తను పస్తున్నా మామగారికోసం పడ్డ ఆవేదన, ఆత్రుత అర్థమయ్యాయి. అత్తగారికి మనసులోనే శతకోటి వందనాలు అర్పించింది.

కానీ తన భర్త ప్రవర్తన, మనస్తత్వం, కసాయితనం గుర్తొచ్చి ఆ ముసలి దంపతులకు తనువంతు కర్తవ్యంగా ఏమీ చేయలేని నిస్సహాయత్వానికి క్రుంగిపోయింది. కాకపోతే తన అత్తామామలకి పట్టిన దుస్థితి ఈలోకంలో వేరెవరికీ రాకూడదని ముక్కోటి దేవతలనూ ప్రార్థించింది.

''పద ముందు ఆస్పత్రికెళదాం నీకు జ్వరం తగ్గినట్టు లేదు'' అన్నాడు కళ్ళు తుడుచుకుంటూ పాండురంగారావు.

''నాకే జ్వరమూలేదు. అయినా మనమిప్పుడు వెళ్ళాల్సింది గుడికీ తర్వాత ఎక్కడైనా మనిద్దరమూ కళ్ళు మూసేవరకూ కలిసుండే చోటికీ. పదండి'' అంటూ భర్త చేయిపట్టుకుని బైటికి నడిచింది.

★